సాక్షి కుమురం భీం

గురువారం ၊ 19 ၊ సెప్టెంబర్ ၊ 2024



బడి ప్రగతికి బాటలు

విద్యార్థుల సమగ్ర సమాచారం ఒకేచోట నమోదుకు కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్ పోర్టల్ తీసుకొచ్చింది. ఈ వివరాల ఆధారంగా నిధులు కేటాయించనుంది. 8లో▸

నేడు ప్రత్యేక సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రత్యేకాధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం 33.5 /25.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణపై కార్యాచరణ సిద్ధం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వానాకాలం– 2024 సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణపై అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), పౌరసరఫరాల శాఖ అధికారులు, సహకార మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కొనుగోళ్లు నిర్వహించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ దాసరి వేణు మాట్లాడారు. జిల్లాలోని రైస్ మిల్లులను గుర్తించడంతోపాటు అవసరమైన గన్నీ సంచులను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ముందస్తుగా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు.

‘ఎస్పీఎం’ మొండివైఖరి మార్చుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) యాజమాన్యం మొండివైఖరి మార్చుకోవాలని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మిల్లు యాజమాన్యం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా స్థానికేతరులకు ఇస్తుందని మండిపడ్డారు. అసెంబ్లీ ఆవరణలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నాయకులు శ్యాంరావు, రాజ్‌కుమార్, నక్క మనోహర్, సలీం, నరేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లా క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14, 17 జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు(బాలబాలికలు) నిర్వహించారు. జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అండర్ 14 విభాగంలో 32 మంది, అండర్ 17 విభాగంలో 32 మంది బాలబాలికలు జోనల్ స్థాయికి ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు వెల్లడించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు మధుసూదన్, వనిత, రమేశ్, జితేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

చేతులు మారితే చాలు..!

- కాగజ్‌నగర్‌లో మున్సిపల్ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు కుట్ర
- నిబంధనలు పాటించకుండా లేఖతోనే సరిపెట్టిన అధికారులు
- ఇరువురి అంగీకారం లేక నేటికీ రిజిస్ట్రేషన్ రద్దు కాని వైనం
- నిర్లక్ష్యం వహిస్తే రూ.4 కోట్ల స్థలంపై ఆశలు వదులుకోవాల్సిందే..



నిర్మాణ దశలో ఆగిన మున్సిపల్ కాంప్లెక్స్.. అక్కడే కొనసాగుతున్న వ్యాపారాలు

సాక్షి, ఆసిఫాబాద్: కంచే చేను మేసింది అన్న చందంగా తయారైంది కాజగ్‌నగర్ మున్సిపాలిటీ పరిస్థితి. మామూళ్ల మత్తులో కూరుకుపోయిన కొందరు పురపాలిక అధికారులు అక్రమంగా మున్సిపాలిటీకి చెందిన స్థలానికే ఇంటి నంబరు కేటాయించారు. దానిని ఆధారంగా చూపి ఓ మహిళ ఏకంగా తన కుమారుడి పేరిట ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించింది. ‘సాక్షి’లో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు తప్పు సరిదిద్దుకునే ప్రయత్నంలో భాగంగా ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆసిఫాబాద్ సబ్‌రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. లేఖ రాయడంతోనే చేతులు దులుపుకొన్న అధికారులు పరోక్షంగా అక్రమార్కులకు ఆ స్థలాన్ని కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.4.50 ఎకరాల స్థలం

కార్మికశాఖకు చెందిన సర్వే నం.147/2లోని 4.50 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం 2008 అక్టోబర్ 13న కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి కేటాయించింది. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి పట్టణంలోకి వెళ్లే రహదారికి ఇరువైపులా ఈ స్థలం ఉంది. మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న 497 చదరపు గజాల స్థలంలో వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్న క్రమంలోనే.. ఈ స్థలం తనదంటూ రాపెల్లి భాగ్యలక్ష్మి అనే మహిళ సిర్పూర్ కోర్టును 2016లో ఆశ్రయించింది. నిర్మాణ పనులపై ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకుంది. అప్పటి నుంచి స్థలవివాదం కొనసాగుతోంది. రూ.కోట్లు విలువైన స్థలంపై ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లు కన్నేసి, మున్సిపల్ అధికారులతో చేతులు కలిపారు. వారి ముందస్తు ప్రణాళికలో భాగంగానే సర్వే నం.147/2లో ఉన్న స్థలానికే సర్వే నంబరు మార్చి(146 సర్వే నంబరుగా చూపుతూ) ఇంటి నంబరు కోసం రాపెల్లి భాగ్యలక్ష్మి జూలై 13న దరఖాస్తు చేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే అధికారులు ఆ స్థలానికే ఇంటి నంబర్ 1–16–552/4/ఏ కేటాయించారు. ఆ తర్వాత భాగ్యలక్ష్మి స్థలాన్ని తన కుమారుడు వెంకట సాయిబాబుకు గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించింది. రెండు సర్వే నంబర్లకు ఒకే సరిహద్దులు ఉండటంతో దీనిపై ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు రిజిస్ట్రేషన్ రద్దు కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

రెండోసారి మారితే..

భాగ్యలక్ష్మి తన కుమారుడి పేరిట డాక్యుమెంట్ 1103/2024 నంబరుపై జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని ఆసిఫాబాద్ సబ్‌రిజిస్ట్రార్‌కు కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య లేఖ రాశారు. కానీ రిజిస్ట్రేషన్ రద్దు కావాలంటే క్రయ, విక్రయదారులు ఇరువురు సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలో అంగీకారం తమ తెలపాలి. అయితే మున్సిపల్ స్థలం రిజిస్ట్రేషన్ విషయంలో మాత్రం మున్సిపల్ అధికారులు కేవలం లేఖ వరకే పరిమితమయ్యారు. భాగ్యలక్ష్మిని పిలిపించి సబ్‌రిజిస్ట్రార్ వద్ద అంగీకారం తీసుకోలేదు. ఇరువురు అంగీకారం లేకపోతే ఆ రిజిస్ట్రేషన్ రద్దు కాదని ఆసిఫాబాద్ సబ్‌రిజిస్ట్రార్ అప్పారావు చెబుతున్నారు. ఒకవేళ ఆ రిజిస్ట్రేషన్ ఆధారంగా అదే స్థలాన్ని వేరొకరెవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే మాత్రం ఆ స్థలంపై మున్సిపాలిటీకి ఎలాంటి హక్కు ఉండదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు స్పష్టంగా ఉన్నా అధికారులు మాత్రం స్థలాన్ని దక్కించుకునే దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. అక్రమార్కులకు మేలు చేయాలన్న కుట్రతోనే కాలయాపన చేస్తున్నారని మున్సిపల్ సిబ్బంది బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ఊరుకుంటున్నారెందుకు?

కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన రూ.కోట్ల విలువైన స్థల వివాదం ఎనిమిదేళ్లుగా సిర్పూర్ కోర్టులో నడుస్తోంది. కేసు వేసిన మహిళ పేరిటే ఇంటి నంబర్ కేటాయించిన మున్సిపల్ అధికారులు.. తాపీగా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరి చేతులు దులుపుకోవడంపైనా సర్వత్రా చర్చ జరుగుతోంది. కేవలం భారీ మొత్తంలో డబ్బు చేతులు మారడంతోనే చూస్తూ ఊరుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

‘ముసాయిదా’పై అభ్యంతరాలు సమర్పించండి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 335 జీపీలకు సంబంధించి వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించామని తెలిపారు. ఈ నెల 21 వరకు అభ్యంతరాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈ నెల 26 వరకు అభ్యంతరాలు పరిశీలించి 28న తుదిజాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఓటర్లు https://draftrolls. tsec.gov.in/gpwardwisevoterlistrural1.do ద్వారా కూడా జాబితాలో తమ వివరాలను తనిఖీ చేసుకోవచ్చు. సమావేశంలో డీపీవో భిక్షపతిగౌడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘మంత్రి హామీతో సమ్మె వాయిదా’

ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి చేపట్టాల్సిన సీహెచ్‌సీలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెషెంట్ కేర్ కార్మికుల సమ్మెను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీతో వాయిదా వేసినట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్ తెలిపారు. మంత్రితో పాటు హైదరాబాద్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌తో జరిగిన చర్చల్లో కార్మికుల సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ మేరకు సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, కార్మికులు యథావిధిగా విధులు నిర్వర్తిస్తారని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణతోనే అభివృద్ధి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- ఆదివాసీలతో ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

తిర్యాణి(ఆసిఫాబాద్): శాంతిభద్రతల పరిరక్షణతోనే సమాజ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆదివాసీ నాయకులు, సార్‌మెడీలు, పటేళ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే శాంతియుత మార్గంలో ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అలా కాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించి, ఇతరులకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పోలీసులు నిత్యం ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తారని, అందులో భాగంగానే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. చదువుతోనే భవిష్యత్తు బాగుపడుతుందని, ఆదివాసీలు తమ చిన్నారులను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని సూచించారు. గిరిజనులు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సైలు మాధవ్, రామారావు, మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్, నాయకులు మడావి గుణవంత్‌రావు, వెడ్మ భగవంత్‌రావు, తొడసం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘సర్కారు’లో టీచర్ల కొరత

- జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 561 ఖాళీలు
- ప్రస్తుత బదిలీలతో మోడల్ స్కూళ్లలోనూ భారీగా ఖాళీలు
- మొత్తం 17 మంది వెళ్లే.. వచ్చింది ఇద్దరు మాత్రమే
- బోధకులు లేక నష్టపోతున్న విద్యార్థులు



జిల్లా కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలతో విద్యార్థులకు నష్టం జరుగుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల భర్తీ జరగడం లేదు. బదిలీలు, పదోన్నతులతో జిల్లా నుంచి అనేక మంది వెళ్లిపోగా.. మారుమూల ప్రాంతంలో పని చేసేందుకు కొత్తవారు మాత్రం ఆసక్తి చూపలేదు. ప్రాథమిక పాఠశాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. గతంలో విద్యార్థులు నష్టపోకుండా విద్యావలంటీర్లను నియమించేవారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియామకం ఇప్పటివరకు పూర్తికాలేదు. మరోవైపు డీఎస్సీ నియామక ప్రక్రియ సైతం పూర్తికాకపోవడంతో కొత్త టీచర్లు ఎప్పుడు ఉద్యోగాల్లో చేరుతారనే దానిపై స్పష్టత కరువైంది.

డీఎస్సీ ద్వారా 319 పోస్టులు భర్తీ

జిల్లావ్యాప్తంగా మొత్తం 704 ప్రభుత్వ పాఠశాలలు(స్థానిక సంస్థలు) ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 561, ప్రాథమికోన్నత పాఠశాలలు 83, ఉన్నత పాఠశాలలు 60 ఉన్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో 37,948 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో అన్ని స్థాయిల్లో ఉపాధ్యాయ పోస్టులు 2455 ఉండగా.. ప్రస్తుతం 524 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీజీ హెచ్‌ఎంలు 05, ఎస్జీటీలు 389, ఎస్ఏ(గణితం) 9, ఎస్ఏ(ఫిజికల్ సైన్స్) 12, ఎస్ఏ (సాంఘిక) 20, ఎస్ఏ(బయోసైన్స్) 12, ఎస్ఏ(ఇంగ్లిష్) 6, తెలుగు, హిందీ పండిత్ 29తోపాటు రిటైర్మెంట్‌తో మరో 47 ఖాళీలు ఏర్పడ్డాయి. ఇందులో డీఎస్సీ ద్వారా కేవలం 319 పోస్టులను మాత్రమే భర్తీ చేయనున్నారు. ఇటీవల బదిలీలు, పదోన్నతులతో చాలామంది స్కూల్ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ) స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ)గా పదోన్నతి పొందారు. ఫలితంగా ప్రాథమిక పాఠశాలల్లో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. కొన్ని స్కూళ్లలో ఒక్కరూ కూడా లేరంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉంటే ఇద్దరూ బదిలీపై వెళ్లారు. అదే మండలం గొల్లగూడ స్కూల్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులు నష్టపోకుండా విద్యాశాఖ అవరమైన చోటుకు 33 మందిని సర్దుబాటు చేసింది. అయితే సర్దుబాటు ఉత్తర్వులు అందినా కొంతమంది దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

గిరిజన శాఖలో ఇలా..

ఇటీవల గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీ(కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్)ల బదిలీల ప్రక్రియ చేపట్టారు. 158 ప్రాథమిక పాఠశాలలు, 48 ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 229 మంది స్కూల్ అసిస్టెంట్లు, 206 మంది ఎస్టీటీలను కొత్త స్థానాలకు బదిలీ చేశారు.

మోడల్ స్కూళ్లలో భారీగా ఖాళీలు..

రాష్ట్ర ప్రభుత్వం 2013లో మోడల్ స్కూళ్లను ప్రారంభించగా అప్పటి నుంచి ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు బదిలీలు జరగలేదు. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్(యూ)లో మోడల్ స్కూళ్లు ఉండగా.. 12 ఏళ్ల తర్వాత జరిగిన బదిలీలతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు దాదాపు మొత్తం మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. సిర్పూర్(యూ), ఆసిఫాబాద్ ఆదర్శ పాఠశాలల నుంచి 17 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు, అధ్యాకులు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇద్దరు మాత్రమే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం 15 పోస్టుల ఖాళీగా మారాయి. ఒక్క ఆసిఫాబాద్‌లోనే పీజీటీ తెలుగు, ఇంగ్లిష్, గణితం, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్, టీజీటీ తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్ పోస్టులు ఖాళీగా మారాయి. విద్యా సంవత్సరం మధ్యలో బోధకులు వెళ్లిపోవడంతో చదువులపై ప్రభావం చూపుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో ఇక్కడ ప్రవేశాలకు పోటీ ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 807 మంది చదువుతున్నారు. చదువుతోపాటు క్రీడలు, ప్రయోగాలు, పోటీ పరీక్షల్లోనూ సత్తా చాటుతున్నారు. ఇలాంటి స్కూల్‌ను మధ్యలో వదిలివెళ్లడం బాధాకరమని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆసిఫాబాద్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మంగళవారం మహేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇలా..


పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించాలని నిబంధనలు చెబుతున్నాయి. విద్యార్థులు 19లోపు ఒక టీచర్, 20 నుంచి 60 వరకు ఉంటే ఇద్దరు టీచర్లు, 61 నుంచి 90 వరకు ఉంటే ముగ్గురు, 91 నుంచి 120 వరకు నలుగురు, 121 నుంచి 150 వరకు ఐదుగురు ఎస్జీటీలు, ఒక హెచ్‌ఎం, 201 నుంచి 240 వ రకు విద్యార్థులు ఉంటే హెచ్‌ఎం, ఆరుగురు ఎస్జీటీలు, 241 నుంచి 280 వరకు ఉంటే హెచ్‌ఎం, ఏడుగురు ఎస్జీటీలు, 281 నుంచి 320 వరకు ఎనిమిది మంది ఎస్జీటీలు, ఒకరు హెచ్‌ఎం, 321 నుంచి 360 వరకు ఉంటే తొమ్మిది మంది ఎస్జీటీలు, ఒక హెచ్‌ఎం, 361 నుంచి 400 వరకు విద్యార్థులు ఉంటే పది మంది ఎస్జీటీలు, ఒక హెచ్‌ఎం ఉండాలి.

బదిలీలతోనే ఖాళీలు

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో జిల్లాలో ఖాళీల సంఖ్య పెరిగింది. విద్యార్థులు నష్టపోకుండా చర్యలు చేపడుతున్నాం. విద్యార్థులు ఎక్కువ మంది ఉన్న చోటుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాం.

– అశోక్, డీఈవో

తాత్కాలిక పద్ధతిలో భర్తీ



ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో ఇటీవల జరిగిన బదిలీలతో పీజీటీ పోస్టులు 9, టీజీటీ పోస్టులు 4 ఖాళీ అయ్యాయి. ఖాళీలను భర్తీ కోసం జిల్లా కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకెళ్లాం. వారి అనుమతితో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులు నష్టపోకుండా చూస్తాం.

– మహేశ్వర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఆసిఫాబాద్ మోడల్ స్కూల్

మళ్లీ రావయ్యా.. గణపయ్యా

- జిల్లా కేంద్రంలో ఘనంగా వినాయక నిమజ్జనం
- పోలీసు నిఘా నీడలో శోభాయాత్ర



శివసాయి గణేశ్ మండలి శోభాయాత్ర



ప్రత్యేక వాహనంలో గణనాథుడి శోభాయాత్ర



గణనాథుడి ఎదుట డ్యాన్స్ జోష్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం గణపతి నిమజ్జనోత్సవం వైభవోపేతంగా ముగిసింది. మూడు రోజులుగా వినాయక నిమజ్జనం కొనసాగుతుండగా.. చివరిరోజు శివకేశవ మందిర్‌లో నెలకొల్పిన గణనాథుడు, బజార్‌వాడీ సంఘసేవ గణేశ్ మండలి, జన్కాపూర్ శ్రీరామభక్త గణేశ్ మండలి, పట్టణంలోని కంచుకోట, సాయిగణేశ్ మండలి తదితర మండలిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఆదిదేవుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి వివేకానందాచౌక్, గాంధీచౌక్, పొట్టి శ్రీరాములుచౌక్, శివకేశవమందిర్, బ్రాహ్మణవాడ, రావులవాడ, కంచుకోటల మీదుగా పెద్దవాగు వరకు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారుల కోలాటం, దాండియా నృత్యాలు ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం వరకు నిమజ్జనోత్సవం కొనసాగింది. డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సీఐ సతీశ్‌కుమార్, తదితరులు శాంతిభద్రతలు పర్యవేక్షించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెద్దవాగు వద్ద లైటింగ్, క్రేన్ ఏర్పాటు చేసి గజఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. కాగా.. శివకేశవ మందిర్ వద్ద లడ్డూ, కరెన్సీ మాలలకు నిర్వహించిన వేలంలో భక్తులు పోటీ పడ్డారు. పట్టణానికి చెందిన పి.వినోద్ రూ.57,116కు లడ్డూ కైవసం చేసుకోగా, వినాయకుడి మెడలోని కరెన్సీ మాలను పుల్లూరి శంకర్ రూ.25,116కు దక్కించుకొన్నారు. వేలంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకర్, ప్రతినిధులు ప్రసాద్, వెంకటేశ్వర్లు, బాలేశ్వర్, వెంకన్న, ప్రమోద్, విశ్వేశ్వర్, దిలీప్, తిరుపతి, శ్రీనివాస్, సతీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వాసవి గణేశ్ మండలి వద్ద మహిళల కోలాటం



అట్టహాసంగా సాగుతున్న గణనాథుడి శోభాయాత్ర

క్లుప్తంగా

ఐఎన్‌టీయూసీ 327 ఉమ్మడి జిల్లా యూనియన్ ఎన్నిక


కే.సుదర్శన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ట్రాన్స్‌కో విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని బుధవారం పాత మంచిర్యాలలోని ఓ కన్వెన్షన్ హాల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎన్‌టీయూసీ 327 రాష్ట్ర సెక్రెటరి జనరల్ ఇనుగాల శ్రీధర్, ఎన్‌పీడీసీఎల్ జేఏఓ పెద్ది రమేశ్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు జేఎల్‌ఎంలు, ఆర్టిజన్‌లు పెద్ద మొత్తంలో 327 యూనియన్‌లో చేరారు. ఇక ఉమ్మడి జిల్లా ఐఎన్‌టీయూసీ 327 నూతన అధ్యక్షుడిగా కె.సుదర్శన్(లైన్ ఇన్‌స్పెక్టర్), సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.వెంకటేశ్వర్(లైన్ ఇన్‌స్పెక్టర్), సభ్యులుగా రామకృష్ణ, మధుకర్, రవీందర్, సురేశ్, శ్రీనివాస్, గంగాధర్, ఉమ్మడి జిల్లా నుంచి పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా వెంకటరమణ


వెంకటరమణ

బెల్లంపల్లి: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా బెల్లంపల్లికి చెందిన చంద్రగిరి వెంకటరమణ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. తనను కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీగా నియమించడంపై వెంకటరమణ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల రిమాండ్

లక్సెట్టిపేట: కిడ్నాప్‌కు పాల్పడ్డ వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ప్రకాష్, సీఐ నరేందర్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 14న మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మత్స్య సహకార సంఘ ఎన్నికలు ఉన్నందున గ్రామానికి చెందిన శంకరయ్యకు లింగయ్య, సంతోష్ పోటీ వచ్చారని తెలిపారు. శంకరయ్య ఓటమి భయంతో ఇద్దరిని కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. బాదె సరోజ ఫిర్యాదు మేరకు కిడ్నాప్‌కు గురైన వ్యక్తులను కనుగొన్నట్లు తెలిపారు. కిడ్నాప్‌కు సహకరించిన మహ్మద్ మహోద్దీన్, దేవేందర్, రవి, తరుణ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తె లిపారు. రెండు కార్లు, రూ.4వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యువ నాయకుడిపై దాడి !

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలలో సీసీసీ కార్నర్‌కు చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడిపై ఓ ప్రముఖ రియల్టర్ అండతో కొందరు వ్యక్తులు మంగళవారం రాత్రి దాడి చేశారు. పోలీసులు గణేశ్ నిమజ్జనం, శోభాయాత్ర బందోబస్తులో ఉండగా.. ఇదే అదునుగా భావించి ఐబీ చౌరస్తాలోని ఓ హోటల్ వెనుకాల దాడి చేసినట్లు బుధవారం వెలుగులోకి వచ్చింది. దాడిని పోలీసులు, బాధితులు రహస్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక సీఐ బన్సీలాల్‌ను సంప్రదించగా.. దాడి విషయం తమ దృష్టికి రాలేదని, పద్మశాలినగర్ బోర్డు వద్ద అదే కాలనీలో పక్క పక్క బజారుకు చెందిన వారు గొడవ పడుతున్నారని సమాచారం రాగానే వెళ్లి సర్దిచెప్పి పంపించినట్లు తెలిపారు.

బడి ప్రగతికి బాటలు

- యూడైస్ ప్లస్ ఆధారంగా చర్యలు
- బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇదే ప్రాతిపదిక
- విద్యాసంస్థల సమగ్ర సమాచారం నిక్షిప్తం
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న వివరాల నమోదు


జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో అభ్యసిస్తున్న చిన్నారులు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వివరాలు

జిల్లా	ప్రభుత్వ	ప్రైవేటు
నిర్మల్	842	192
ఆదిలాబాద్	1,279	151
మంచిర్యాల	869	221
కుమురంభీం	1,148	102

నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థుల సమగ్ర సమాచారం ఒకేచోట నమోదుకు కేంద్ర ప్రభుత్వం యూడైస్ ప్లస్(ఇన్ఫర్మేషన్ ఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్ తీసుకొచ్చింది. విద్యాశాఖ అందించే సమగ్ర వివరాల ఆధారంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, బోధకుల వివరాలన్నీ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 25వరకు యూడైస్ ప్లస్ 2024–25 విద్యాసంవత్సరం నమోదు ప్రక్రియ ముగియనుంది. ఇంతకు మునుపు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని సమాచారం నిక్షిప్తమై ఉండేది. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక వసతులు, సదుపాయాల వివరాలన్నీ నమోదు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు, 40 పైచిలుకు ఇంటర్మీడియట్ కళాశాలలు, ప్రైవేటు బడులు, కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, వసతుల వివరాలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీని ప్రకారం ఈ పోర్టల్‌కు ఉపాధ్యాయ, పాఠశాలల వివరాలను అనుసంధానం చేస్తున్నారు. ఒక్కో విద్యార్థి ఆధార్ సంఖ్య, పుట్టిన తేదీ, తరగతి వివరాలు పొందుపర్చుతున్నారు. గత 2021–22 సంవత్సరం వరకు యూడైస్ వివరాలను నమోదు చేయగా, గతేడాది నుంచి మాత్రం యూడైస్ ప్లస్ అనే పోర్టల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో నమోదు చేసిన, చేయాల్సిన వివరాలను మూడు విభాగాలుగా విభజించి నిక్షిప్తం చేస్తున్నారు..

ఏమేం ఉన్నాయి..?

ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో యూడైస్ ప్లస్ లో వివరాలు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 1 నుంచి ఇంటర్ వరకు దాదాపు 2.5 లక్షల మంది విద్యార్థుల వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ గణాంకాల ఆధారంగానే రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదలకు అవకాశం ఉంది. పాఠశాలల్లో తరగతి గదులు ఎన్ని ఉన్నాయి, విద్యార్థుల సంఖ్య, మరుగుదొడ్లు, ఆటస్థలాలు, వంటగదులు, తాగునీటి వసతి తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ప్రతీ విద్యార్థికి శాశ్వత విద్య క్రమ సంఖ్య(పీఈఎన్, పర్మినెంటు ఎడ్యుకేషన్ నంబరు) కేటాయించనున్నారు. దీంతో ఏయే తరగతుల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారనే విషయం ఇట్టే తెలిసిపోతుంది. యూడైస్‌లో నమోదు చేసిన వివరాలను అత్యంత గోప్యంగా, ప్రామాణికంగా నిర్వహించడానికి వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠశాలకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. కాగా, వివరాల నమోదుపై నిర్మల్ డీఈవో డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల సమగ్ర వివరాల ద్వారా పారదర్శకత పెరుగుతుందని, వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించేలా ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

మంచిర్యాల జిల్లాలో..

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నమోదులో వెనుకబడినట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు 1090 ఉన్నాయి. ఇందులో 1,21,305 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు 1090 పాఠశాలల్లో 797 పాఠశాలల సమగ్ర వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఇంకా 293 పాఠశాలల నమోదు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా 221 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 58,033 మంది చదువుతున్నట్లు ఇదివరకు లెక్కలున్నాయి. యాజమాన్యాలు డేటా పొందుపర్చడంలో మొక్కుబడిగా వ్యవహరిస్తున్నాయి. అపార్టుమెంటులో పాఠశాలలు కొనసాగిస్తుండడం, ఆటస్థలాలు లేకపోవడం వల్ల జాప్యం చేస్తున్నాయి. అర్హతలేని టీచర్లతో బోధన, తక్కువ వేతనాలు చెల్లిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. టీచర్లకు వేతనాలు అందక, తక్కువగా ఉన్నాయని మానేయడం యాజమాన్యాలకు కలిసి వస్తున్నాయి. దీంతో టీచర్ల కాకి లెక్కలతో డేటా నమోదు చేస్తూ తప్పించుకుంటున్నాయి. టీచర్లు ఎప్పుడు మానేస్తారో తెలియదని.. వివరాలు ఎలా నమోదు చేయాలో తెలియకుండా పోతోందని ప్రైవేటు యాజమాన్యాలు వాపోతున్నాయి.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. గతేడాది 1090 పాఠశాలల్లో 1,26,904 మంది ఉండగా ఈ ఏడాది 1,21,305కు పడిపోయింది. ఈ లెక్కన 5,559 మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, అర్హులైన ఉపాధ్యాయులు, మౌలిక వసతులున్నా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

క్రేన్ టైర్ కింద నలిగిన కార్మికుడు

- వినాయకుని నిమజ్జన సమయంలో ప్రమాదం
- చికిత్స పొందుతూ మృత్యువాత
- ఆస్పత్రి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యులు, కార్మికుల ధర్నా
- ఎమ్మెల్యే, అధికారుల హామీతో ఆందోళన విరమణ


మృతుడు లింగంపల్లి నగేశ్(ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. వినాయకుడి ప్రతిమను క్రేన్ సాయంతో ఎక్కించే క్రమంలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులకు గాయాలు కాగా.. చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిమజ్జనోత్సవం సందర్భంగా స్థానిక పెద్దవాగు వద్ద మంగళవారం రాత్రి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు లింగంపల్లి నగేశ్(46), ప్రేమ్‌కుమార్ విధులు నిర్వర్తిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో క్రేన్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో క్రేన్ టైర్ల కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటినా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. రెండు కాళ్లకు తీవ్ర గాయాలైన లింగంపల్లి నగేశ్‌ను వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో కరీంనగర్ సమీపంలో మృతిచెందాడు. నగేశ్‌కు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా.. ప్రేమ్‌కుమార్ స్థానికంగా చికిత్స పొందుతున్నాడు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత

కాంట్రాక్టు కార్మికుడు లింగంపల్లి నగేశ్ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, కార్మికులు బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మృతదేహంతో బైఠాయించారు. ఒకానొక దశలో మృతదేహంతో కార్యాలయంలోకి చొచ్చుకపోయే ప్రయత్నం చేయగా, డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో షెటర్లను మూసివేశారు. సుమారు మూడు గంటలకుపైగా ఆందోళన కొనసాగింది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ రూ.50 లక్షల పరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కార్యాలయానికి చేరుకుని కుటుంబీకులు, కార్మికులతో చర్చించారు. సుదీర్ఘ చర్చల అనంతరం రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా, తక్షణసాయం కింద దహన సంస్కారాలకు రూ.30 వేల నగదు అందించారు. డబుల్ బెడ్రూం ఇల్లు, ఇన్సూరెన్స్ నగదు రూ.15 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు పూర్తి బాధ్యత వహిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్యే హరీశ్‌బాబు సొంతంగా రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, శంకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, కార్మికులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యసేవలు అందేలా చూడాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆశ్రమ పాఠశాలల ఏఎన్‌ఎంలు, వార్డెన్లను ఆదేశించారు. ఉట్నూర్‌లోని కుమురంభీం సమావేశ మందిరంలో బుధవారం గిరిజన పోషణ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని నాలుగు జిల్లాల డీఎంహెచ్‌వోలకు సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు గల భోజనం అందించాలని ఏటీడీవోలకు సూచించారు. యూనిట్ అధికారులు రెండు ఆశ్రమ పాఠశాలలను దత్తత తీసుకోవాలన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోలు, ఏడీఎంహెచ్‌వో మనోహర్, డీటీడీవో రమాదేవి, ఏటీడీవోలు, జీసీడీవోలు, వార్డెన్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉడుముతో ఇన్‌స్టా రీల్స్.. కేసు నమోదు

కడెం: సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం యువత ఇన్‌స్టా రీల్స్ చేస్తూ చిక్కుల్లో పడుతున్నారు. విభిన్నంగా ఉండాలని ఉడుము పట్టుకుని రీల్స్ చేసిన యువకుడిపై కేసు నమోదైంది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం అకొండపేట్ గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ మాడుగుల రాధాకృష్ణ గత నెలలో ఉడుము పట్టుకుని 'భయ్యా ఇప్పుడే నా వేట.. దొరకవట్టిన ఇప్పుడు పొలంలోకి వచ్చింది. కేజీన్నర ఉంటాది భయ్యా కష్టపడి పట్టుకున్నా.. ఇయ్యాల దావతే' అంటూ ఇన్‌స్టాగాంలో రీల్ పోస్ట్ చేశాడు. కరీంనగర్‌కు చెందిన జంతు ప్రేమికుడు ఎదులపురం గౌతం ఈ రీల్‌ను చూసి ఇటీవల నిర్మల్ డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేశాడు. డీఎఫ్‌వో ఆదేశాల మే రకు బుధవారం నిందితుడిని పట్టుకుని కేసు నమో దు చేసినట్లు ఎఫ్‌ఆర్వో గీతారాణి తెలిపారు.

శోభాయాత్రలో విషాదం

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న గణేశ్ నిమజ్జన శోభాయాత్ర వేళ ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పట్టణంలోని కురాన్నపేట్ కాలనీకి చెందిన లక్ష్మణ్–కవిత దంపతుల చిన్న కుమారుడు సుంక దరహాస్ (19) హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. మంగళవారం గణేశ్ నిమజ్జనానికి నిర్మల్ వచ్చాడు. రాత్రి 11 గంటల సమయంలో మరో యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై శివాజీచౌక్ వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫోన్ పోయిందని ఆత్మహత్యాయత్నం..!

భైంసాటౌన్: సెల్‌ఫోన్ పోయిందన్న కారణంతో మద్యం మత్తులో ఓ వ్యక్తి బ్రిడ్జి పైనుంచి దూకిన ఘటన బుధవారం భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తానూర్ మండలం బామ్ని తండాకు చెందిన కాశీనాథ్ సెల్‌ఫోన్ మరమ్మతు కోసం భైంసాకు వచ్చి స్థానికంగా మద్యం సేవించి పడిపోయాడు. భార్య బులాబాయి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో భైంసాకు చేరుకుని ఆటోస్టాండ్ వద్ద ఆరా తీసింది. దీంతో స్థానిక వైన్స్ వద్ద పడిపోయినట్లు తెలుసుకుని వెంటనే ఆటోలో గ్రామానికి తీసుకెళ్తుండగా ఆర్టీసీ డిపో వద్ద ఆటో ఆపి సెల్‌ఫోన్ పోయిందంటూ బ్రిడ్జిపై నుంచి దూకాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన గుండేవణి బూదమ్మ(60) బలవన్మరణానికి పాల్పడింది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. దొనబండ గ్రామానికి చెందిన బూదమ్మ రెండేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో ఉన్న బావిలో దూకింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నార. భర్త కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేకకు మేత కోసం వెళ్లి వృద్ధుడు మృతి

కడెం: తాను పెంచుకుంటున్న మేకకు మేతకోసం వెళ్లిన వృద్ధుడు ప్రాణాలు వదిలిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని సారంగపూర్ గ్రామానికి చెందిన ఎగుర్ల భీరయ్య(78) బుధవారం ఉదయం మేకకు మేత కోసమని ఇంటి సమీపంలో ఉన్న పెరటి తోట వద్దకు వెళ్లాడు. తోటలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగ కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఖానాపూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

మేకలను కాపాడబోయి యువకుడు మృతి

తానూరు: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన యాసిర్‌ఖాన్ (19) బుధవారం గ్రామానికి చెందిన అతిక్‌తో కలిసి మేకలు కాసేందుకు గ్రామ శివారులోని సంగన్‌గాం చెరువుకు వెళ్లాడు. మధ్యాహ్నం మేకలకు నీటిని తాగించే క్రమంలో రెండు మేకలు నీటిలోకి వెళ్లాయి. వాటిని రక్షించే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. విషయాన్ని అతిక్ కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. మృతుని తండ్రి మోయిన్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. సిరోంచ తాలూకాలోని టికాడ గ్రామానికి చెందిన రమేశ్, స్నేహల్, సాగర్ సొంత పనుల కోసం మోటార్ సైకిల్‌పై చెన్నూర్‌కు వచ్చారు. పనులు ముగించుకుని మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వెళ్తుండగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

దాడికి పాల్పడిన నలుగురి అరెస్ట్

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఈ నెల 17న నిర్వహించిన గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో గ్రామస్తులపై దాడికి పాల్పడ్డ నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు. మక్కల దినేష్, దోత్రే నిఖిల్, దోత్రే బాలాజీ, మెట్‌కర్ విష్ణును అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మరో ఇద్దరు విశాల్, చందు కోసం గాలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరోగ్యమిత్రల సమ్మె బాట

- నిరవధిక సమ్మెతో ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం
- డిమాండ్లను నెరవేర్చాలని వినతులు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 74 మంది..


ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయాన్ని ముట్టడించిన ఆరోగ్య మిత్రలు

మంచిర్యాలటౌన్: ఆరోగ్యశ్రీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని బుధవారం నుంచి నిరవధిక సమ్మె బాట పట్టారు. అన్ని జిల్లాల్లోని ఆరోగ్యమిత్రలు హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనకు దిగారు. ఆరోగ్యమిత్రలతోనే ఆరోగ్యశ్రీ సేవలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అందిస్తున్నారు. వారు సమ్మె బాట పట్టడంతో ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. 17 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా రూ.13,533 మాత్రమే వేతనం ఉందని, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను నెట్టుకురావాల్సి వస్తోందని, తమ డిమాండ్లను పరిశీలించాలని కొన్నాళ్లుగా ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్, టీం లీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. మంచిర్యాల జిల్లాలో 16 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తుండగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 74 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆరోగ్యశ్రీ టీం లీడర్ల సహాయంతో ప్రస్తుతం ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం కలగకుండా చూస్తున్నా నిరవధిక సమ్మె కొనసాగితే ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.

వేతనాలు సరిపోవడం లేదని...

ఆరోగ్యమిత్రల వేతనం రూ.15 వేలు కాగా, కటింగ్‌లు పోను చేతికి వచ్చేది రూ.13,533 మాత్రమే. ప్రతీ నెల ఒక సెలవు ఇస్తుండగా.. ఆదివారాలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ పథకం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, ఆయుష్మాన్ భారత్, జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌కు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా మేనేజర్, టీమ్ లీడర్, ఆఫీస్ అసోసియేట్, ఆరోగ్యమిత్రలుగా 24గంటలపాటు విధులు నిర్వర్తిస్తున్నారు.

డిమాండ్లు ఇవే..

- ఆరోగ్యమిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి, జీవో 60 ప్రకారం రూ. 22,750 వేతనాన్ని తక్షణమే అమలు చేయాలి.
- జీతభత్యాలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్టు ద్వారానే చెల్లించాలి. కాంట్రాక్టు విధానంలోకి మార్చాలి.
- రాబోయే పీఆర్‌సీలో కనీస వేతనం రూ.35 వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలి.

వేతనాలు సరిపోవడం లేదు



ఆరోగ్యశ్రీ ట్రస్టు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఉద్యోగం చేస్తున్నాను. వేతనాలు పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. డిగ్రీ, పీజీలు చదివిన వారే ఉన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ఉద్యోగ భద్రతను కల్పించాలి.

– శారద, ఆరోగ్యమిత్ర, మంచిర్యాల

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆరోగ్యశ్రీ ట్రస్టు ఏర్పడినప్పుడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చేరాం. 17 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానే గుర్తిస్తున్నారు. వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించి, కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి. ట్రస్టు ద్వారా వేతనాలు అందించాలి.

– ప్రవీణ్, ఆరోగ్యమిత్ర, నిర్మల్

లోకేశ్వరంలో చోరీ


లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు వైద్యుడు వెంకటేష్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. వెంకటేష్ ఇంటికి తాళం వేసి గడ్‌చాందకు వెళ్లగా గమనించిన గుర్తు తెలి యని దుండగులు ఇంటితాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 15 గ్రా ముల బంగారం, రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

కుభీర్: మండలంలోని కీరునాయక్ తండాకు చెందిన సీఐఎస్‌ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ లచ్చు (57) సోమవారం చెన్నైలో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకురాగా రామగుండం నుంచి వచ్చిన సీఐఎస్‌ఎఫ్ జవాన్లు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య సేవంతాబాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమసమాజ స్థాపనే పీడీఎస్‌యూ లక్ష్యం

మంచిర్యాలఅర్బన్: సమ సమాజ స్థాపన లక్ష్యంతో పీడీఎస్‌యూ ఏర్పడిందని వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం స్థానిక మార్క్స్‌భవన్‌లో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల పూర్వ, ప్రస్తుత పీడీఎస్‌యూ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది వారోత్సవ సభ లోగో ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలైన నేపథ్యంలో అక్టోబర్ 24న హైదరాబాద్‌లో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అడ్వకేట్ ఆర్.ప్రకాశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టి.శ్రీనివాస్, నైనాల గోవర్ధన్, వేణు, మంగ, సమ్మయ్య, రజియా, మల్లేష్, చంద్రయ్య, లాల్ కుమార్, శ్రీకాంత్, చరణ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ పాల్గొన్నారు.


పీడీఎస్‌యూ సభ లోగో ఆవిష్కరణ

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

సిర్పూర్(టి): మండల కేంద్రం మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువులను సిర్పూర్(టి) పోలీసులు పట్టుకున్నారు. ఛతీస్‌గఢ్ నుంచి మహారాష్ట్ర మీదుగా రెండు ఐచర్ వాహనాల్లో కర్ణాటకలోని కోలార్ ప్రాంతాని కి అక్రమంగా 35 పశువులు(34 ఆవులు, ఒక ఆవు) తరలిస్తుండగా సిర్పూర్(టి) మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నామని ఎస్సై కమలాకర్ తెలిపారు. సి.రామచంద్ర(కర్ణాటక), నవాబ్‌ఖాన్, స లావుద్దీన్, అల్తాఫ్‌ఖాన్, ఎస్కే ఆదిల్ పాషా, ఆదిఫ్ పాషాపై కేసులు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.